క్లుప్తంగా

నేటి నుంచి పనుల జాతర

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి మండలంలో పనుల జాతర- 2025 కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీఓ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉపాధిహామీ, పంచాయతీ రాజ్, వాటర్‌షెడ్, ఎస్‌బీఎం, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించి కొత్త పనులకు భూమిపూజ, పూర్తయిన వాటిని ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధి గ్రామాల్లో గ్రామసభలు చేపట్టనున్నామని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నానో యూరియాను వాడండి


రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ కవిత

కడ్తాల్: రైతులు యూరియాకు బదులు నానో యూరియాను వాడాలని మండల వ్యవసాయాధికారి(ఏఓ) కవిత కోరారు. సాంప్రదాయ యూరియాతో పోల్చితే నానో సమర్థవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఎరువు, విత్తనాల స్టాక్ రిజిస్టర్ ఈ పాస్ యంత్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన యూరియాను మాత్రమే విక్రయించాలని సూచించారు. కేంద్రం నిర్వాహకులు హనుమంత్‌రెడ్డి, మహేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై చర్చ


మహాసభలో సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: రాష్ట్ర మహాసభల్లో దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై చర్చించనున్నామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య తెలిపారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా గాజుల రామారాంలో జరుగుతున్న పార్టీ రాష్ట్ర 4వ మహాసభలకు తుర్కయంజాల్ నుంచి ఆ పార్టీ నాయకులు గురువారం తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పి.శివ కుమార్, కాటం రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఈ నరేందర్ తదితరులు

కడ్తాల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. గురువారం మండల పరిధి సాలార్‌పూర్ గ్రామంలో ఏఈ నరేందర్‌తో కలిసి పలు కాలనీ ప్రజలతో మాట్లాడి సరఫరా సమస్యను తెలుసుకున్నారు. 11 విద్యుత్ స్తంభాలతో పాటు, 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ఇక్బాల్, బాబా, రమేశ్ ఉన్నారు.

దేవర చెరువు కట్టకు మరమ్మతు


కోత ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏఈ మహేందర్‌రెడ్డి

కడ్తాల్: ప్రస్తుత వర్షాలకు దేవర చెరువు కట్ట ఓ చోట కొంత మేర కోతకు గురయింది. సమాచారం మేరకు గురువారం మైనర్ ఇరిగేషన్ ఏఈ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజీ కోత ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఏఈ.. సొంత డబ్బులు వెచ్చించి రాళ్లు, ఇసుక సంచులు వేయించి మరమ్మతు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇదే విధంగా ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని, ముందస్తు చర్యలు చేపట్టేందుకు దోహదపడుతుందని స్థానికులను కోరారు.

చిగురిం‘చెట్టు’


ఒక దగ్గర నుంచి మరో చోట నాటిన మామిడి వృక్షం



చిగురించిన మామిడి, వేప చెట్లు

తొలగించారు.. ప్రాణం పోశారు
- 150 వృక్షాలకు రీప్లాంటేషన్
- ఒక్కో చెట్టుకు రూ.20 వేల వ్యయం
- కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో కళకళలాడుతున్న వైనం

ఇబ్రహీంపట్నం రూరల్: అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నాయని ఆ చెట్లను కూకటి వేళ్లతో సహా పెకిలించారు. చెట్లు ప్రగతికి మెట్లు. పర్యవరాణానికి, జీవకోటికి రక్ష అని భావించారు. వాటిని బతికించుకునేందుకు వ్యవప్రయాసాలకుకోర్చి మరో ప్రాంతానికి తరలించారు. రీ ప్లాంటేషన్ పద్ధతిలో ఆ వృక్షాలకు ప్రాణం పోశారు.

అడ్డుగా ఉన్నాయని..

ఆదిబట్ల మున్సిపాలిటీలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు బడా వ్యాపారులు బారులు తీరుతున్నారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఓ ప్రైవేట్ సంస్థ భారీ గోదాంల నిర్మాణానికి 40 ఎకరాలకు పైగా స్థలాన్ని సేకరించింది. ఒక్కో గిడ్డంగిని ఏడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించేందుకు ప్రణాళికలు చేసింది. నిర్మాణ ప్రక్రియను జాతీయ నిర్మాణ సంస్థకూ అప్పగించింది. కానీ షెడ్ల నిర్మాణానికి అక్కడి వృక్ష సంపద అడ్డుకావడంతో వాటిని సదరు సంస్థ సాంకేతిక పరిజ్ఞానంతో తొలగించింది.

నిత్యం నీరు పట్టి..

గిడ్డంగుల నిర్మాణానికి అడ్డుగా ఉన్నాయని తొలగించిన 150 చెట్లను.. సదరు యాజమాన్యం రిప్లాంటేషన్ పద్ధతిలో ఒక్కో చెట్టుకు రూ.20 వెచ్చించి వేళ్లతో సహా పెకలించింది. జేసీబీ, క్రేన్ల సహాయంతో కలెక్టరేట్ వెళ్లే మార్గం, తదితర ప్రాంతాలకు తరలించారు. నరికేసిన కొమ్మలకు, వేర్లకు రసాయనాలు పూసి, మళ్లీ నాటారు. వాటికి నిత్యం నీరు పట్టి జీవం పోశారు. ప్రస్తుతం అవి చిగురు తొడిగి, పచ్చగా కళకళలాడుతున్నాయి. మొత్తంగా రూ.4 లక్షలను ఖర్చు చేశామని సదరు సంస్థ యజమాని లోహిత్‌రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం కాపాడటం కోసమే ఈ పని చేశామని, ఇది మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి శనివారం నగరంలోని ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నా వాల్‌పోస్టర్‌ను యూఎస్‌పీఎస్, టీఎస్‌యూటీఎఫ్ నేతలు గురువారం తుర్కగూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నేతలు గాలయ్య, అనిల్‌కుమార్, రాములయ్య, బాలయ్య, కిరణ్‌కుమార్, జహీర్, అంజయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

మంచాల: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చవితి నవరాత్రి ఉత్సవాలను ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించుకోవాలని కోరారు. మండపాల ఏర్పాటు, ఇతర అంశాలపై చట్టబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మధు, ఎస్‌ఐ రామకృష్ణ, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌కు మరమ్మతులు చేపట్టండి


ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

హుడాకాంప్లెక్స్: ఏటా వినాయక చవితి వస్తుందని తెలిసినా అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తూ.. సదుపాయాలు చేయకుండా హిందువుల పండుగలను చిన్నచూపు చూస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆరోపించారు. గురువారం ఆమె సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించారు. చెరువు కట్టపై గుంతలను, బండ్ పగుళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎక్కడైనా వినాయక విగ్రహాలు తేవడం నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఇబ్బందులు కలిగితే ఊరుకోమన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీలు, మండపాల వద్ద సదుపాయాలు, విగ్రహాల రాకపోకల దారుల్లో చెట్లకొమ్మలు, విద్యుత్ వైర్లు తొలగించడం, నిమజ్జనానికి మార్గం సుగమం చేయడం ఎంతో అవసరమన్నారు. సరూర్‌నగర్ చెరువు బండ్ విరిగిపోయే ప్రమాదం ఉందని, ఎన్ని నెలలుగా సూచనలు ఇచ్చినా అధికారులు నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

మహేశ్వరం: మామిడిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో మురళీకృష్ణ ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కల్లెం నరేశ్‌గౌడ్, డైరెక్టర్లు చీమలదరి చెన్నయ్య, గౌండ్యాల శేఖర్‌ముదిరాజ్, కానుగుల భాస్కర్, గుర్జని రాధిక, ఏ.అనిత, ఎక్స్‌అఫీషియో సభ్యుడు యు.సుధీర్‌లతో ప్రమాణం చేయించారు. ఏడాది కాలపరిమితితో ఈ కమిటీ కొనసాగనుంది. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాలకమండలి సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, లాల్ సతీష్‌గౌడ్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ మనందరి బాధ్యత

గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్యామల


షాద్‌నగర్‌రూరల్: వృద్ధులను సన్మానిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కమ్మదనం గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్యామల విద్యార్థులకు సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ప్రోత్సాహంతో వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలిసి ఫొటోలు దిగుతూ, ఆటాపాటలతో సరదాగా గడిపారు. వృద్ధు తమ అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో వృద్ధులు తమ కుటుంబ సభ్యులకు భారమవుతున్నారని, బంధాలను దగ్గర చేసేందుకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని సూచించారు. పెద్దల పట్ల ప్రేమ, ఆప్యాతలు లేకపోవడం, ఉద్యోగాల పేరుతో తమ పిల్లలు దూరంగా ఉండటంతో కొడుకులు, కోడళ్లు దూరమైపోతున్నారన్నారు. పాత తరాల వారితో బంధాలు, అనుబంధాలను కొనసాగించడంతో పిల్లలకు మానవ సంబంధాలపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ద్వారా చిన్నారుల్లో కుటుంబ విలువలను పెంపొందించవచ్చన్నారు. అనంతరం వృద్ధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల, పాఠశాలలో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల, పాఠశాలలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రణీత ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, తల్లిదండ్రులు పాల్గొని సందడి చేశారు. వారికి క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం వృద్ధులందరినీ సన్మానించి.. స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు, ఎన్‌హెచ్ 765 ప్రాజెక్ట్ మేనేజర్ నిరంజన్ పాఠక్ రూ.20 వేలు విరాళంగా గురువారం ఠాణాలో ఎస్‌ఐలకు అందజేశారు. ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, ఎన్‌హెచ్ మేనేజర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి మాసబ్ చెరువు ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సాగర్ రెసిడెన్సీ, సాగర్ ఎన్‌క్లేవ్, రాఘవేంద్ర కాలనీ, సాయిరామ్ నగర్, జన చైతన్య కాలనీ, సూర్య సాయినగర్, గంగిరెడ్డి వెంచర్, శ్రీశ్రీ ఎన్‌క్లేవ్ పరిధిలో సరఫరాకు ఆటంకం కలగనుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు అండగా నిలిచారు. మృతుడు మారేష్‌తో 1992- 93 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అందరూ కలిసి రూ.31 వేల ఆర్థిక సహాయాన్ని మారేష్ భార్యకు గురువారం అందజేశారు. తులేకలాన్ మాజీ సర్పంచ్ యాదగిరి, జంగయ్య, రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్య, గణేశ్, సత్యనారాయణ, మారేపల్లి యాదగిరి, బాలరాజు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు: కోనాపూర్ మాజీ సర్పంచ్ కడారి యాదయ్య తండ్రి పాపయ్య ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను గురువారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, నాయకులు సంజీవ, రవి, వెంకటేశ్, గణేశ్ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

అబ్దుల్లాపూర్‌మెట్: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ 23వ వార్డు రామకృష్ణాపురం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సొంత ఖర్చుతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, గణేశ్ మండపాలను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగార్జున, నాయకులు రాజు, రాజేందర్, విజేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి సూర్యకళావతి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌ల నిషేధం హర్షణీయం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు
- జీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి
- అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

ఇబ్రహీంపట్నం: ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటు పడి యువత జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ యాప్‌లను నిషేధిస్తూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును ప్రవేశ పెట్టడం హర్షణీయమని బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి అన్నారు. కేంద్రం నిర్ణయాన్ని హర్షిస్తూ.. గురువారం ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ రక్షణకు కేంద్రం తీసుకున్న నిర్ణయం బాగుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసకావద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, భగీరథ సాగర్, మడుపు గోపాల్, దండె నర్సింహ యాదవ్, ఐలేష్, పోరెడ్డి సురేందర్‌రెడ్డి, గౌరిగి రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు: తలకొండపల్లిలో పోచమ్మ, మైసమ్మ బోనాల ఊరేగింపు

గ్రామదేవతలకు బోనం వైభవం


ఆమనగల్లు: తలకొండపల్లిలో పోతురాజుల విన్యాసం

శ్రావణమాసం చివరి వారాన్ని పురస్కరించుకొని గురువారం ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గ పరిధి గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు భక్తజనం నెత్తిన బోనంతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లారు. అనంతరం నైవేద్యంగా అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువత కేరింతలు ఆకట్టుకున్నాయి.

–సాక్షి, నెట్‌వర్క్


కడ్తాల్: గోవిందాయిపల్లిలో మైసమ్మ బోనాలు


ఇబ్రహీంపట్నం: డిగ్రీ కళాశాలలో బోనాల సందడి


తుర్కయంజాల్: బ్రాహ్మణపల్లిలో బీరప్ప, మహంకాళి బోనాలు


యాచారం: నందివనపర్తిలో పోచమ్మకు..


కడ్తాల్: వంపుగూడ పోచమ్మ బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

యూరియా పాట్లు

- పేర్ల నమోదుకు పడిగాపులు
- ఒక్క రోజే 550 బస్తాలు విక్రయం
- అవసరం మేరకు మరో 1100 బ్యాగ్‌ల దిగుమతికి ఆర్డర్
- ధర పెంచేసిన ప్రైవేట్ వ్యాపారులు!


లారీ నుంచి యూరియాను దిగుమతి చేసుకుంటున్న రైతులు

యాచారం: ఎడతెరిపి లేని వర్షాలతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుత సమయంలో పత్తి, వరికి యూరియా అందిస్తే ఆశించిన మేర దిగుబడి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. గురువారం ఉదయం నుంచే పీఏసీఎస్‌కు రైతులు బారులు తీరారు. నిల్వలు లేకపోయినప్పటికీ తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు పడిగాపులు కాశారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం తరువాత యూరియా లోడ్ రావడంతో అన్నదాతలు ఒక్కసారిగా ఎగబడగా.. పీఏసీఎస్ సిబ్బందికి కొంచెం ఇబ్బంది కలిగింది. లారీలో వచ్చిన 550 బ్యాగులు రెండు గంటల వ్యవధిలోనే ఖాళీ అయ్యాయి. రైతుల అవసరం మేరకు పీఏసీఎస్ సీఈఓ నాగరాజు.. వ్యవసాయాధికారి రవినాథ్‌కు సమాచారం ఇచ్చారు. మరో 1100 సంచుల యూరియా తెప్పించేందుకు ఆర్డర్ పెట్టారు.

రూ.వంద పెంచేసి..

రైతుల అవసరాన్ని ప్రైవేట్ ఫర్టిలైజర్ వ్యాపారులు క్యాష్ చేసుకున్నారు. ఒక్కో సంచికి రూ.100 పెంచి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాయితీపై ఒక బ్యాగు కేవలం రూ. 267కే అమ్మాలి. కానీ యాచారం, మాల్ కేంద్రాల్లోని ప్రైవేట్ వ్యాపారులు రూ.367కు విక్రయించినట్లు తెలుస్తోంది. పీఏసీఎస్‌లో పట్టాదారు, పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డుల వివరాలు ఇచ్చి రూ.267కే కొనుగోలు చేస్తున్న కొందరు వ్యాపారులు.. అత్యవసరమున్న రైతులకు రూ.500ల చొప్పున తీసుకొని, అంటగట్టినట్లు వ్యవసాయాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు.


పీఏసీఎస్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

> **లైసెన్స్ రద్దు చేస్తాం**
>
> 
>
> నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియా సంచిని రూ.267కే విక్రయించాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అలా ఎవరైనా అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. చర్యలు తీసుకుంటాం. వారి లైసెన్స్‌ను రద్దు చేస్తాం. పీఏసీఎస్‌లో అర్హులైన రైతులకే యూరియా విక్రయించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – రవినాథ్, మండల వ్యవసాయ అధికారి